

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.140	203	231
సూర్యాపేట	రూ.135	200	230
నల్లగొండ	రూ.140	204	230

ఉష్ణోగ్రత గరిష్ఠం 42.0 । కనిష్ఠం 24.0



ఎన్నికల అధికారి హన్మంతు కే.జెండగేకు నామినేషన్ పత్రం అందజేస్తున్న బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్, పక్కన కేంద్రమంత్రి జైశంకర్, బీజేపీ నాయకులు కే.లక్ష్మణ్, తదితరులు

జోరుగా నామినేషన్లు

లోక్‌సభ సమరంలో నామినేషన్ల ఘట్టం ఊపందుకుంది. నల్లగొండ, భువనగిరి స్థానాలకు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఒక్కొక్కరుగా నామినేషన్లు వేస్తుండగా, ఆయా పార్టీల ఆధ్వర్యంలో ర్యాలీలు, సభలు కొనసాగుతున్నాయి. జాతీయ, రాష్ట్ర నేతల రాకతో ఉమ్మడి జిల్లాలో లోక్‌సభ ఎన్నికల సమరం సందడిగా కొనసాగుతోంది.

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)

- జాతీయ, రాష్ట్రనేతల రాకతో సందడి
- అంతా తామై వ్యవహరిస్తున్న మంత్రులు, మాజీ మంత్రులు
- ఉమ్మడి జిల్లా నుంచే బస్సుయాత్ర ప్రారంభించనున్న మాజీ సీఎం కేసీఆర్

భువనగిరి లోక్‌సభ స్థానం నుంచి పోటీచేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి చామలకిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపు కోరుతూ ఈ నెల 21న నిర్వహించిన బహిరంగసభకు ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఇదే నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిగా బరిలో ఉన్న డాక్టర్ బూరనర్సయ్యగౌడ్ నామినేషన్ సందర్భంగా మంగళవారం నిర్వహించిన ర్యాలీకి కేంద్రమంత్రి జైశంకర్, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ హాజరయ్యారు. బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్ ఈ నెల 22న నామినేషన్ దాఖలు చేయగా, భువనగిరి లో భారీ ర్యాలీ నిర్వహించారు. భువనగిరి నుంచి బరిలో ఉన్న సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్ నామినేషన్ కార్యక్రమానికి పార్టీ జాతీయ నేత బీవీ.రాఘవులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు హాజరై, ర్యాలీలో పాల్గొన్నారు. నల్లగొండ లోక్‌సభ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి మంగళవారం భారీ ర్యాలీతో నామినేషన్ దాఖలు చేశారు. ఈ ర్యాలీలకు మాజీమంత్రి జగదీ్‌ష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు హాజరయ్యారు. బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి సోమవారం నామినేషన్ దాఖలు చేయగా, ఆయన తరఫున నిర్వహించిన ర్యాలీకి కేంద్రమంత్రి కిరణ్‌రిజిజు హాజరయ్యారు. కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి బుధవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ సందర్భంగా నల్లగొండలో భారీ ర్యాలీ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈనెల 29తో నామినేషన్ల ఘట్టం ముగియనుండడంతో ఇక ప్రచారం వేగం పుంజుకోనుంది. ప్రచారానికి సంబంధించి ప్రధాన పార్టీల అభ్యర్థుల తరఫున ఏ కీలకనేతలను తీసుకురావాలనే అంశంపై ఇప్పటికే ఆయా పార్టీలు స్పష్టమైన ప్రణాళికతో ఉన్నాయి.

గెలుపు బాధ్యతలు మంత్రులు, మాజీ మంత్రులకు

కాంగ్రెస్ తరఫున రెండు సీట్ల నుంచి అభ్యర్థులను గెలిపించే బాధ్యతలను భుజాన వేసుకున్న మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి అంతా తామై వ్యవహరిస్తున్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నల్లగొండ లోక్‌సభకు పార్టీ ఇన్‌చార్జి కూడా కావడంతో ఆయన నేతృత్వంలో ఇప్పటికే పార్లమెంటరీ స్థాయి సన్నాహక సమావేశంతో పాటు, అసెంబ్లీ నియోజకవర్గాల సన్నాహక సమావేశాలు నిర్వహించారు. భువనగిరి లోక్‌సభ స్థానానికి తొలుత మంత్రి కోమటిరెడ్డి ఇన్‌చార్జిగా కొనసాగినా, ఇటీవల ఆయన సోదరుడు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. ఉమ్మడి జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో ప్రచార వ్యూహంతో పాటు, ప్రతిపక్షాలకు కౌంటర్‌గా మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు వ్యూహాత్మకంగా ముందుకెళుతున్నారు. తన కుమారుడు రఘువీర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలనే లక్ష్యంతో కుందూరు జానారెడ్డి తెరవెనుక మంత్రాంగం నిర్వహిస్తున్నారు. మంత్రులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీలను సమన్వయం చేయడంతో పాటు, తనకున్న విస్తృత సంబంధాలతో కుమారుడి కోసం ఆయన పనిచేస్తున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థుల తరఫున మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీ్‌ష్‌రెడ్డి ప్రచార బాధ్యతలు భుజానవేసుకున్నారు. రెండు నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులను సమన్వయం చేయడంతో పాటు, అధికార పార్టీని ఎక్కడికక్కడ నిలదీస్తూ ప్రచార వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గ సన్నాహక సమావేశాలతో పాటు, నామినేషన్ల ర్యాలీలను పూర్తిచేశారు. మాజీ సీఎం కేసీఆర్ రోడ్‌షో అనంతరం అభ్యర్థుల ప్రచారాన్ని వేగవంతం చేసేందుకు సిద్ధమయ్యారు.

● ఉమ్మడి జిల్లాపై బీజేపీ ప్రత్యేక దృష్టిపెట్టింది. అభ్యర్థుల ఎంపికలో భిన్నత్వాన్ని ప్రదర్శించిన ఆ పార్టీ గెలుపుకోసం జాతీయ నాయకత్వాన్ని రంగంలోకి దించింది. నామినేషన్ల ర్యాలీలకు కేంద్ర మంత్రులు హాజరవగా, ఇప్పటికే ఆర్ఎస్ఎస్‌కు చెందిన కీలకనేతలు తెరవెనుక ఉండి ఎప్పటికప్పుడు వ్యూహాలను అభ్యర్థులకు అందిస్తూ ప్రచార వేగం తగ్గకుండా చూస్తున్నారు.

నేటి నుంచి కేసీఆర్ బస్సుయాత్ర

జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలైన తర్వాత బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ ఉమ్మడి జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఇప్పటికే రెండు పర్యాయాలు జిల్లాను చుట్టేసిన ఆయన కృష్ణాజలాల సాధనలో ప్రభుత్వ వైఫల్యం, కరువుకు కాంగ్రెసే కారణమనే అంశాలను తెరమీదకు తెచ్చారు. తాజాగా, జిల్లాలోని మిర్యాలగూడ నుంచే బుధవారం కేసీఆర్ లోక్‌సభ ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తున్నారు. బస్సుయాత్ర ద్వారా బుధవారం నల్లగొండ లోక్‌సభ పరిధిలోని మిర్యాలగూడ, సూర్యాపేటలో రోడ్‌షో నిర్వహించి ప్రసంగించనున్నారు. గురువారం భువనగిరి లోక్‌సభ పరిధిలో బస్సుయాత్ర నిర్వహించనున్నారు.

నామినేషన్ కౌంటర్ 5వ రోజు

నియోజకవర్గం	23న దాఖలు	గతంలో దాఖలు	మొత్తం
నల్లగొండ	8	25	33
భువనగిరి	18	24	42
మొత్తం	26	49	75

ఐదు రోజు 26 నామినేషన్లు

ఉమ్మడి జిల్లాలోని రెండు స్థానాలకు దాఖలు

నల్లగొండ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి

భువనగిరి నుంచి బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్

నల్లగొండ, భువనగిరి అర్బన్, ఏప్రిల్ 23: ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాలకు ఐదో రోజైన మంగళవారం 26 నామినేషన్లు దాఖలయ్యాయి. నల్లగొండ నల్లగొండ పార్లమెంట్ స్థానానికి 8 మంది అభ్యర్థులు 9సెట్ల నామినేషన్లను దాఖలుచేశారు. వీరిలో ఇద్దరు రాజకీయ పార్టీల అభ్యర్థులు కాగా, మిగిలిన ఆరుగురు స్వతంత్ర అభ్యర్థులు. బీఆర్ఎస్ తరుపున ఆ పార్టీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి రెండు సెట్లు నామినేషన్ దాఖలు చేశారు. ఎస్‌జేపీ(సోషల్ జస్టిస్ పార్టీ ఆఫ్ ఇండియా) తరుపున సుంకర లింగయ్య ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా అఖిల్ సంపంగి, రేళ్ల పెద్దనరసింహారావు, సుంకరి రమేష్, అబ్దుల్ మాలిక్, కిన్నెర యాదయ్య, పోలిశెట్టి వెంకటేశ్వర్లు ఒక్కో సెట్ నామినేషన్ దాఖలుచేశారు. స్వతంత్ర అభ్యర్థుల్లో కిన్నెర యాదయ్య ఈ నెల 9న ఒక సెట్ నామినేషన్ దాఖలు చేసి, తిరిగి ఈ రోజు మరో సెట్ దాఖలు చేశారు.

● భువనగిరి నియోజకవర్గానికి 18 నామినేషన్లు దాఖలయ్యాయి. బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ రెండో సెట్ నామినేషన్ వేశారు. సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్ మూడోసెట్, సీపీఎం అభ్యర్థిగా బట్టుపల్లి అనురాధ ఒక సెట్, విముక్తి చిరుతల కక్షి పార్టీ అభ్యర్థిగా ఎర్ర సూర్యం ఒక సెట్, బహుజన ముక్తి పార్టీ అభ్యర్థిగా పెంట రమేష్, బహుజన లెఫ్ట్ పార్టీ అభ్యర్థిగా నూనె వెంకటస్వామి, బ్లూ ఇండియా పార్టీ అభ్యర్థిగా డప్పు వీరస్వామి ఒక సెట్, పీపుల్ ప్రొటెక్షన్ పార్టీ అభ్యర్థిగా ఉంద్యాల సదానందరెడ్డి మూడోసెట్, ఆధార్ పార్టీ అభ్యర్థిగా తాళ్లపల్లి రమేష్ గౌడ్, స్వతంత్ర అభ్యర్థులుగా ఊదరి మల్లేష్ మూడోసెట్, పోతుల యాదగిరి ఒక సెట్, ఆరూరి వెంకటేశం ఒక సెట్, కారింగుల యాదగిరి ఒకసెట్, రేకల సైదులు రెండో సెట్, బొల్లారం బాలరాజు ఒకసెట్, బూషపాక వెంకటయ్య ఒక సెట్, సంజీవులు ఒక సెట్, జంగా సుజాత ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు.

పోచంపల్లి వస్త్రాలను

విశ్వవ్యాప్తం చేశాం

- మోదీ అంటే 3డీ
- కేంద్ర విదేశాంగశాఖ మంత్రి జైశంకర్



భువనగిరిలో ర్యాలీలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి జైశంకర్

•7లో..

సాగర్‌ను ఎండబెట్టిన కేసీఆర్

ఏ మొఖంతో వస్తున్నారు

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నల్లగొండలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

•7లో..

అబద్ధాలతో కాలం వెళ్లదీస్తున్న సీఎం

- మాజీ మంత్రి జగదీ్‌ష్‌రెడ్డి
- అట్టహాసంగా కంచర్ల కృష్ణారెడ్డి నామినేషన్ దాఖలు



నల్లగొండలో ర్యాలీలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీ్‌ష్‌రెడ్డి

•7లో..



జై హనుమాన్

రామభక్త హనుమాన్ జయంతిని జిల్లావ్యాప్తంగా వేడుకగా జరుపుకొన్నారు. ఉదయం నుంచే అందంగా ముస్తాబు చేసిన ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రతిమను ఊరేగించారు. పట్టణ ప్రధాన వీధుల గుండా ఆంజనేయుడి ఊరేగింపు ఉత్సవం చూడముచ్చటగా సాగింది. గుండెల నిండా ఆంజనేయుడి నామస్మరణతో జై హనుమాన్.. జై శ్రీరాం నినాదాలు మారుమోగాయి.

•8లో..

‘పది’కి వేసవి ప్రణాళిక

- పదో తరగతి విద్యార్థుల ప్రతిభకు మెరుగులు
- 2024-25 విద్యా సంవత్సర విద్యార్థులకు వేసవిలో ఆన్‌లైన్ బోధన
- జిల్లాలో విద్యార్థుల సామర్థ్యాన్ని పెంచేందుకు కృషి
- రోజూ గంట చొప్పున రెండు సబెక్టుల బోధన



మోత్కూరు, ఏప్రిల్ 23: పదో తరగతి విద్యార్థుల కోసం జిల్లా విద్యా శాఖ వేసవి ప్రణాళిక రూపొందించింది. డీఈవో నారాయణరెడ్డి ఇందుకుకోసం ప్రత్యేక కార్యాచరణ తయారు చేశారు. పదో తరగతి విద్యార్థులకు అవసరమైన ప్రాథమిక జ్ఞానాన్ని పెంచడానికి ఆయన చర్యలు తీసుకుంటున్నారు. వేసవిలో విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళిక రూపొందించారు. ఈప్రణాళిక అమలు విషయమై పాఠశాల చివరి రోజున మంగళవారం (ఈ నెల 23న) జిల్లాలోని ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు జూన్‌లో పదో తరగతిలోకి రానున్న విద్యార్థులకు అవగాహన కల్పించారు. సబ్జెక్టు నిపుణులు ఆన్‌లైన్ ద్వారా బోధించే విషయాలను విని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రోజుకు రెండు సబ్జెక్టులపై ఆన్‌లైన్ క్లాసులు

2023-24 విద్యా సంవత్సరంలో తొమ్మిదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులకు పదో తరగతి చదివేందుకు ఈ నెల 25 నుంచి జూన్ 11 వరకు ఆన్‌లైన్ ద్వారా జిల్లాలో సంసిద్ధత కార్యక్రమం చేపట్టనున్నారు. జిల్లాలో సబ్జెక్టు ఫోరంలు ఉన్నాయి. ఆయా సబ్జెక్టు ఫోరం ద్వారా సబ్జెక్టు నిపుణులతో ప్రతిరోజూ రెండు సబ్జెక్టులను ఒక్కో సబ్జెక్టు ఒక్కోగంట చొప్పున ఆన్‌లైన్‌లో బోధించనున్నారు. ఇందులో బేసిక్స్ ఎక్కువగా నేర్పించనున్నారు. సబ్జెక్టు నిపుణులు చెప్పింది వినడంతోపాటు వర్క్‌షీట్లు ఇచ్చి విద్యార్థులతో పూర్తి చేయిస్తారు.వాటిని ఉపాధ్యాయులు పర్యవేక్షించేలా చూస్తున్నారు.జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా, ఆదర్శ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులు పది వేల మందికి ఈ ఆన్‌లైన్ బోధనతో లబ్ధిపొందుతారంటున్నారు.

నేటి నుంచి వేసవి సెలవులు

2023-24 విద్యా సంవత్సరం నేటితో ముగిసింది. అన్ని తరగతుల విద్యార్థుల వార్షిక పరీక్షల ఫలితాలు మంగళవారం క్లాస్ టీచర్లు విద్యార్థులకు తెలిపారు. నేటి నుంచి జూన్ 13 వరకు వేసవి సెలవులు ప్రకటించారు. దీంతో విద్యార్థులు సంతోషంగా ఇళ్లకు వెళ్లారు. ఈ నెల 25 నుంచి ప్రస్తుత 9వ తరగతి విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా పదో తరగతి సబ్జెక్టులు బోధించనున్నారు.

సెలవుల్లో పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలి

సహిత విద్య జిల్లా కో ఆర్డినేటర్ పెసరు లింగారెడ్డి

తుర్కపల్లి, ఏప్రిల్ 23: విద్యార్థులకు వేసవి సెలవులు వచ్చినందున పిల్లల్ని తల్లిదండ్రులు జాగ్రత్తగా చూసుకోవాలని సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్ పెసరు లింగారెడ్డి సూచించారు. మండలంలోని కొండాపూర్ ప్రాథమిక, వాసాలమర్రి ఉన్నత, వీరారెడ్డిపల్లి ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో మంగళవారం నిర్వహించిన విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు వేసవి సమయాన్ని వృథా చేయవద్దన్నారు. పై తరగతుల్లో ప్రతిభ కనబరిచేందుకు ప్రత్యేక టైంటేబుల్ ప్రకారం చదవాలన్నారు. ఈత వచ్చినా పెద్దల పర్యవేక్షణ లేకుండా చెరువులు, బావులు, నదుల వద్దకు వెళ్లకూడదన్నారు. కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీమ్స్ తినకుండా తరచూ తాగు నీరు, నిమ్మరసం, కొబ్బరి నీళ్ల వంటివి తాగాలన్నారు. సెలవుల్లో పిల్లలు వీలైనన్ని కథల పుస్తకాలు చదవాలని, బొమ్మలు, పెయింటింగ్‌లు వేయాలని, అభిరుచి మేరకు చిన్నచిన్న కథలు, కవితలు రాయాలని, అందుబాటులో ఉన్న వస్తువులతో అలంకరణ వస్తువులు తయారు చేయాలన్నారు.



విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులను అందజేస్తున్న సహిత విద్య జిల్లా కో ఆర్డినేటర్ పెసరు లింగారెడ్డి

పాఠశాల నుంచి తెచ్చుకున్న గ్రంథాలయం పుస్తకాలను చదవాలన్నారు. విద్యార్థులతో జిల్లా విద్యాశాఖ తరఫున నిర్వహించ తలపెట్టిన 40 రోజుల ప్రత్యేక కార్యాచరణపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయులు నరసింహారావు, ఉమాదేవి, సత్యం, రమణి, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్లు లత, పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

10 రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేస్తాం

పౌరసరఫరాల డీఎం గోపీకృష్ణ

మోత్కూరు, ఏప్రిల్ 23: మోత్కూరు వ్యవసాయ మార్కెట్‌తోపాటు అన్ని కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు 10 రోజుల్లో పూర్తి చేస్తామని పౌరసరఫరాల జిల్లా మేనేజర్ గోపీకృష్ణ అన్నారు. మంగళవారం మోత్కూరు, ఆత్మకూరు(ఎం), గుండాల మండల కేంద్రాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను, ధనలక్ష్మీ, శ్రీనివాస రైస్ మిల్లులను ఆయన పరిశీలించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తూకం వేసిన ధాన్యం బస్తాల ఎగుమతికి లారీలు రాకపోవడం, రైస్ మిల్లుల్లో లారీలు వెంటనే దిగుమతి కాకపోవడం, హమాలీలు సహకరించకపోవడంతో కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయని రైతులు ఆయన దృష్టికి తెచ్చారు. లారీలు ఎక్కువగా పంపాలని ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్ యాదయ్యను, మిల్లుల్లో వెంటనే దిగుమతి చేసుకోవాలని మిల్లుల యజమానులను, హమాలీలతో మాట్లాడి తూకాలు, లోడింగ్ వేగంగా జరిగేలా చూడాలని మార్కెట్ కార్యదర్శిని ఆదేశించారు. సంఘం సీఈవో కె.వరలక్ష్మి, మార్కెట్ కార్యదర్శి ఉమామహేశ్వర్‌రావు, ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్ యాదయ్య, మిల్లు యజమానులు బుస్సా శ్రీనివాస్, తిపిరిశెట్టి శ్రీనివాస్ ఆయన వెంట ఉన్నారు.



మార్కెట్‌లో సీఈవోను వివరాలు అడుగుతున్న గోపీకృష్ణ

సోమ్‌లాల్‌నాయక్‌కు ‘పద్మశ్రీ’ ప్రదానం

భువనగిరి మండలం ఆకుతోటబావికి చెందిన సాహితీవేత్త కేతావత్ సోమ్‌లాల్‌నాయక్ రాష్ట్రపతి ద్రౌపదీముర్ము నుంచి పద్మశ్రీ అవార్డును అందుకున్నారు. బంజారా భాషలో భగవద్గీతను అనువదించినందుకు పద్మశ్రీఅవార్డుకు ఎంపిక చేశారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఆయన రాష్ట్రపతి నుంచి పద్మశ్రీ అవార్డు స్వీకరించారు.

- భువనగిరి రూరల్

రాష్ట్రపతి భవన్‌లో ప్రదానం చేసిన ముర్ము



రాష్ట్రపతి ముర్ము నుంచి పద్మశ్రీ అవార్డు అందుకుంటున్న సోమ్‌లాల్‌నాయక్

నీటి ఎద్దడి నివారణకు చర్యలు: జడ్పీ సీఈవో


చౌటుప్పల్ రూరల్, ఏప్రిల్ 23: వేసవి దృష్ట్యా గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తగు తీసుకోవాలని జడ్పీ సీఈవో శోభారాణి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం, నీటి ఎద్దడిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మిషన్ భగీరథ నీటిసరఫరా తగ్గిపోతే వెంటనే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలన్నారు. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా, రైతుల నుంచి బోర్లు అద్దెకు తీసుకొని నీటి సరఫరా చేయాలన్నారు. యాక్షన్ ప్లాన్‌లో గుర్తించిన పనులను పూర్తి చేయాలన్నారు. కూలీలు వడ దెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఏపీడీ సురేష్, ఎంపీడీవోలు సందీప్‌కుమార్, ప్రమోద్, తదితరులు పాల్గొన్నారు.







యాదగిరీశుడి సన్నిధిలో వైభవంగా తెప్పోత్సవం



భువనగిరి అర్బన్, ఏప్రిల్ 23: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నృసింహుడి సన్నిధిలో మంగళవారం తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు. చైత్ర శుద్ధ పౌర్ణమి రోజున విష్ణుపుష్కరిణిలో తెప్పపై విహరిస్తూ లక్ష్మీసమేతుడిగా భక్తులకు దర్శనమిచ్చారు. కవచమూర్తులను బంగారు ఆభరణాలు, వివిధ పుష్పమాలికలతో దివ్యమనోహరంగా అలంకరించి తిరువీధులవెంట ఊరేగింపుగా వేదమంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ పుష్కరిణి వద్దకు సేవను తరలించారు. కొండపైన విష్ణుపుష్కరిణిలో తెప్పలో మూడు సార్లు జలవిహారం చేశారు. వైభవంగా సాగిన తెప్పోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని గంగాజలాన్ని స్వీకరించారు. ఆలయ పునర్నిర్మాణం తర్వాత తొలిసారి తెప్పోత్సవం నిర్వహించడం విశేషం. కార్యక్రమంలో ఆలయ ఈవో భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, డీఈవో దోర్బల భాస్కరశర్మ, ప్రధానార్చకులు నల్లంథిఘల్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యులు, ఆలయ ఏఈవో దూశెట్టి కృష్ణ, ఆలయ పర్యవేక్షకులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రపాలకుడికి నాగవల్లి దళార్చనలు

గుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి నాగవల్లి దళార్చనలు, నృసింహుడికి నిత్య పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. కొండపైన విష్ణుపుష్కరిణి వద్ద ఆంజనేయస్వామికి వేద మంత్రాలతో పంచామృతాభిషేకం చేసిన అర్చకులు సింధూరం, వివిధ రకాల పూలతో అలంకరించారు. ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు చేపట్టారు. ప్రధానాలయంలోని స్వయంభువులను సుప్రభాత సేవతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవం పాంచరాత్రాగమశాస్త్ర రీతిలో నిర్వహించారు.ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.16,90,140 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

27 రోజుల్లో రూ.2.30కోట్ల హుండీ ఆదాయం

యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడి ఆలయ ఖజానాకు 27 రోజుల్లో రూ.2.30కోట్ల హుండీ ఆదాయం సమకూరింది. మార్చి 27 నుంచి ఈ నెల 22వ తేదీ వరకు క్షేత్ర సందర్శనకు వచ్చిన భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను ఈవో భాస్కరరావు, అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి పర్యవేక్షణలో సిబ్బంది మంగళవారం లెక్కించారు. నగదు రూ. 2,30,76,344, మిశ్రమ బంగారం 147 గ్రాములు, 4.9 కిలోల మిశ్రమ వెండిని ఆలయ ఖజానాలో జమచేసినట్లు ఈవో భాస్కరరావు తెలిపారు. విదేశీ కరెన్సీ 753 అమెరికా డాలర్లు, 45 ఇంగ్లండ్ పౌండ్లు, యూఏఈ 230 దిరమ్స్, మలేషియా 10 రింగిట్స్, యూరప్ 10 యూరోలు, నేపాల్ 10 రూపీస్, కెనడా 180 డాలర్లు, భూటాన్ 12 గుల్ట్రమ్, సౌదీ అరేబియన్ 53 రియల్, సింగపూర్ 11 డాలర్లు, ఇండోనేషియా 50,000 రూపీయా, శ్రీలంక 100 రూపీ, స్వీడన్ 20 క్రోనా కానుకలుగా సమకూరాయని తెలిపారు.



నల్లగొండ... నిప్పుల కొలిమి

- కొనసాగుతున్న భానుడి భగభగలు
- ఉమ్మడి జిల్లాలో 45.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- వడదెబ్బతో వృద్ధుడి మృతి


ధరావత్ గోలియా (ఫైల్)


నల్లగొండ, ఏప్రిల్ 23: భానుడి భగభగల విజృంభణ కొనసాగుతోంది. మండే ఎండలతో ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలు అల్లాడిపోతున్నారు. మధ్యాహ్నం వేళ వడగాడ్పులు అతలాకుతలం చేస్తున్నాయి. శుక్రవారం ఉమ్మడి జిల్లాలో 45.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవడంతో అంతా ఉక్కిరిబిక్కిరి అయ్యారు. నల్లగొండ జిల్లాలో అత్యధికంగా మిర్యాలగూడ మండలం టీక్యాతండాలో 45.1, అత్యల్పంగా చింతపల్లి మండలం గొడకండ్లలో 39.4 డిగ్రీలు, సూర్యాపేట జిల్లా నూతనకల్‌లో అత్యధికంగా 44.0 డిగ్రీలు, అత్యల్పంగా అర్వపల్లిలో 40.5 డిగ్రీలు, యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం బుజిలాపురంలో అత్యధికంగా 42.7 డిగ్రీలు, తుర్కపల్లి మండలం అన్నెవారి తుర్కపల్లిలో అత్యల్పంగా 39.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

వడదెబ్బతో వృద్ధుడి మృతి

ఆత్మకూర్(ఎస్) : సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలంలోని కోటి నాయక్‌తండాకు చెందిన ధరావత్ గోలియా(70) వడదెబ్బతో మంగళవారం మృతి చెందాడు. వారం రోజులుగా తీవ్ర ఎండలు, వడగాడ్పులతో అస్వస్థతకు గురై చికిత్స పొందుతూ మృతి చెందాడు. గోలియాకు భార్య, నలుగురు కుమారులు, కుమార్తె ఉన్నారు.















పోచంపల్లి వస్త్రాలను విశ్వవ్యాప్తం చేశాం

భువనగిరి టౌన్, ఏప్రిల్ 23: దేశంలో నిర్వహించిన జీ-20 సమ్మిట్‌లో ప్రతినిధులకు పోచంపల్లి వస్త్రాలను బహుమతిగా ఇవ్వడం ద్వారా మోదీ చేనేత కార్మికుల ప్రతిభను ప్రధాని మోదీ విశ్వవ్యాప్తం చేశారని కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్ అన్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలో బీజేపీ భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ నామినేషన్ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. నర్సయ్యగౌడ్‌కు మద్దతుగా బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కే లక్ష్మణ్, బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డితో కలిసి మంగళవారం భువనగిరిలో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన పాల్గొన్నారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన కేంద్ర మంత్రి మాట్లాడారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికలు దేశ భవిష్యత్‌తో ముడిపడి ఉన్నాయన్నారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వాన్ని బలపర్చాల్సిన అవసరం ఉందన్నారు. మోదీ అంటేనే 3డీ (ధర్మం, దేశం, డెవలప్‌మెంట్) అని అన్నారు. మూడోసారి మోదీ సర్కారులో భువనగిరికి ప్రాతినిధ్యం దక్కేలా ఓటర్లు నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలన్నారు. దేశవ్యాప్తంగా ఓవర్గం అరాచకాలను సమర్థిస్తూ మత రాజకీయాలకు పాల్పడుతున్న హీన చరిత్ర కాంగ్రెస్‌దే అని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. ప్రధాని మోదీని విమర్శించే స్థాయి సీఎం రేవంత్‌రెడ్డికి లేదన్నారు. అన్నివర్గాల అభివృద్ధి మోదీ పదేళ్ల పాలనలోనే సాధ్యమన్నారు. బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ దేవుళ్ల పేరిట ఒట్లు పెడుతూ అబద్ధాలు చెబుతూ మోసగించేందుకు ప్రయత్నాలు చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. కోమటిరెడ్డి బ్రదర్స్‌కు అన్యాయం చేసిన సీఎం తన అనుచరుడైన ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డి గెలిపించుకునే విధిలేని పరిస్థితుల్లో కోమటిరెడ్డి బ్రదర్స్ ఇంటి గుమ్మం తొక్కడం విచిత్రంగా ఉందన్నారు. కాంగ్రెస్‌పార్టీ అబద్ధపు ప్రచారానికి పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు బుద్ధి చెబుతారని అన్నారు.





బీజేపీ ర్యాలీలో పాల్గొన్న కార్యకర్తలు, ప్రసంగిస్తున్న కేంద్ర మంత్రి జైశంకర్, పక్కన అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్

నా వెనక మోదీ ఉన్నారు : బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్

బలహీనవర్గానికి చెందిన తన వెనక ప్రధాని మోదీ ఉన్నాడని, తనపై సీఎం రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి బ్రదర్స్ చేస్తున్న కుట్రలను ప్రధాని మోదీ అండతో ఎదుర్కొంటానని బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ అన్నారు. కౌరవ సైన్యంతో జరుగుతున్న యుద్ధంలో పాండవులదే గెలుపు తన గొర్రెను గెలిపించుకునేందుకు కోమటిరెడ్డి బ్రదర్స్‌ను కాకా పడుతున్న సీఎం రేవంత్‌రెడ్డికి నియోజకవర్గ ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ ప్రభాకర్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు జీ మనోహర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు పోతంశెట్టి రవీందర్, వడాల శ్రీనివాస్, దాసరి మల్లేశం, పడమటి జగన్మోహన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు చందా మహేందర్‌గుప్తా, యన్నం శివకుమార్, ఊట్కూరి అశోక్‌గౌడ్, మునిసిపల్ వైస్‌చైర్మన్ మాయ దశరథ, జెన్నపల్లి శ్యాంసుందర్‌రెడ్డి, పట్నం శ్రీనివాస్, కౌన్సిలర్లు రత్నపురం బలరాం, బొర్ర రాకేష్, ఉదయగిరి విజయ్‌కుమార్, నల్లమాస సుమ, జనగాం కవిత, ఊదరి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌ను ఎండబెట్టిన కేసీఆర్ ఏ మొఖంతో వస్తున్నారు

- జగదీష్‌రెడ్డి విషయాలు చెప్పిన గుత్తాకు ధన్యవాదాలు
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ, ఏప్రిల్ 23 : కృష్ణాజలాలను ఏపీ రాష్ట్ర సీఎం జగన్మోహన్‌రెడ్డికి అప్పగించి నాగార్జునసాగర్ ప్రాజెక్టును ఎండబెట్టిన కేసీఆర్ ఇప్పుడు ఏ మొఖం పెట్టుకొని నల్లగొండ జిల్లాలో బస్సు యాత్ర చేపడుతున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లగొండ నియోజకవర్గాన్ని రూ.వందల కోట్లతో అభివృద్ధి చేస్తామని, రూ.700 కోట్లతో నల్లగొండ చుట్టూ ఔటర్‌రింగ్ రోడ్డును నిర్మిస్తామన్నారు.త్వరలోనే టెండర్లను ఆహ్వానిస్తామన్నారు. నల్లగొండలోని గడియారం సెంటర్‌లో 2వేల మంది సామర్థ్యంతో నీలగిరి నిలయం నిర్మిస్తామన్నారు. ఐటీ ఉద్యోగులకు సంబంధించి టాటా కంపెనీతో ఒప్పందం చేసుకున్నామని, పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఏఎమ్మార్పీ లైనింగ్‌కు, బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టుకు గత ప్రభుత్వం నిధులు కేటాయించలేదని త్వరలో ఎస్ఎల్‌బీసీతో సహా ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేయిస్తామన్నారు. ఆగస్టులో బ్రాహ్మణవెల్లంల నుంచి 60 వేల ఎకరాలకు నీటిని విడుదల చేసేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. నిరుద్యోగులకు ఉచిత డీఎస్సీ కోచింగ్ ఇప్పిస్తామన్నారు.

జగదీష్‌రెడ్డికి రూ.5 వేల కోట్ల ఆస్తులు

వాటర్‌ప్లాంట్ పెట్టి మంచినీరు అమ్ముకున్న మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి రూ.5 వేల కోట్లు సంపాదించాడని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. తన దగ్గర జగదీశ్‌రెడ్డికి సంబంధించిన మూడు మర్డర్‌కేసులు, ఆయన కర్ణాటక, మహారాష్ట్రల్లోని కేసుల వివరాలు ఉన్నాయన్నారు. తనకు గుర్తులేని విషమైన జగదీశ్‌రెడ్డి మంచినీరు అమ్ముకున్న విషయాన్ని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి బయటపెట్టినందుకు ఆయనకు ధన్యవాదాలన్నారు. చాలారోజులకు సుఖేందర్‌రెడ్డి జగదీశ్‌రెడ్డి గురించి మంచి వివరాలు చెప్పాడని ప్రశంసించారు. జగదీశ్‌రెడ్డి ఉద్యమం పేరుతో, మంత్రి పదవితో వేల కోట్లు సంపాదించడంతో పాటు హైదరాబాద్‌లో 80 ఎకరాల ఫాంహౌజ్ ఏర్పాటుచేసుకున్నాడని తెలిపారు. తనకు కనీసం నల్లగొండలో ఇల్లు కూడా లేదని అద్దె ఇంట్లోనే ఉంటున్నానని తెలిపారు. ఏడుసార్లు అఫిడవిట్ దాఖలు చేశానని, తనకు ఎలాంటి ఆస్తులు లేవన్నారు.

నేటి రఘువీర్‌రెడ్డి నామినేషన్‌కు భారీగా తరలిరావాలి

నల్లగొండ పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న కుందూరు రఘువీర్‌రెడ్డి బుధవారం నామినేషన్ దాఖలు చేస్తున్నందున భారీగా ప్రజలు తరలిరావాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు. ముఖ్యంగా మహిళలు అధికసంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల్లోగా ర్యాలీ పూర్తి చేస్తామన్నారు. తనను ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలిపించారని, తనకు వచ్చిన మెజార్టీ కంటే అదనంగా 25 వేల మెజార్టీతో రఘువీర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు శంకర్‌నాయక్, జడ్పీటీసీ పాశం రాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూరూరి రమేష్, బొడ్డుపల్లి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద పార్టీలను ఓడించాలి: సీపీఎం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు వెంకట్

బీబీనగర్, ఏప్రిల్ 23 : అవకాశవాద, మతోన్మాద పార్టీలను ఓడించి నిజాయితీ కలిగిన సీపీఎం అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు బీ వెంకట్ ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్‌లో భువనగిరి సీపీఎం అభ్యర్థి జహంగీర్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. అనంతరం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. దేశంలో ప్రజాస్వామ్యం, పౌరహక్కులు ఉండాలంటే కేంద్రంలో బీజేపీ ఓడి, ఇండియా కూటమి అధికారంలోకి రావాలన్నారు. కూటమి గెలిస్తే ప్రజలు అభివృద్ధి చెందుతారని అదే బీజేపీ గెలిస్తే కార్పొరేట్ శక్తులైన అదానీ, అంబానీల సంపదలు పెరుగుతాయని ఆరోపించారు. ఓడిపోతామన్న భయంతో ప్రధాని మోదీ రాజస్థాన్ ఎన్నికల ప్రచారంలో ముస్లిం, హిందువుల మధ్య విద్వేషం పెరిగేలా ప్రసంగించారని అన్నారు. మరోసారి బీజేపీ అధికారంలోకి వస్తే ప్రభుత్వరంగ సంస్థలు ప్రైవేట్‌పరం అవుతాయన్నారు. బీజేపీ మేనిఫెస్టో ప్రజలపై భారాలు మోపి జీవితాలతో ఆడుకునేలా ఉందని విమర్శించారు. బీజేపీ 10ఏళ్ల పాలనలో వైఫల్యాలతో అధికారం కోల్పోతుందని జోష్యం చెప్పారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ, ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు శివకుమార్, ముత్యాలు, సీపీఎం మండల కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దేశ సంపదను దోచిపెడుతున్న బీజేపీ



తుంగతుర్తిలో మాట్లాడుతున్న సీపీఎం అభ్యర్థి జహంగీర్

తిరుమలగిరి/ తుంగతుర్తి /నూతనకల్, ఏప్రిల్ 23 : దేశ సంపదను బీజేపీ ఉన్నత వర్గాలకు దోచిపెట్టిందని సీపీఎం భువనగిరి ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్ అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలో నిర్వహించిన ప్రచార సభల్లో ఆయన మాట్లాడారు. మతోన్మాద బీజేపీ, అవకాశవాద కాంగ్రెస్, అవినీతి బీఆర్ఎస్‌ను ఓడించాలన్నారు. మతం పేరిట ప్రజలను బీజేపీ విభజించి పాలన చేస్తోందని ఆరోపించారు. బీఆర్ఎస్‌కు ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు. ఇచ్చిన హామీలను అమలుచేయలేక కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. ఈ మూడు పార్టీలను ఓడించి, ప్రజల తరఫున పోరాడే సీపీఎంను గెలిపించాలని కోరారు. తుంగతుర్తి ప్రాంతాన్ని భీంరెడ్డి నరసింహారెడ్డి, మల్లు స్వరాజ్యం ఎంతో అభివృద్ధి చేశారన్నారు. తనను గెలిపిస్తే ప్రజలకు అండగా ఉండి, సమస్యలను పరిష్కరిస్తానని అన్నారు. సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి మాట్లాడుతూ ప్రజా సమస్యల కోసం పోరాడేది కమ్యూనిస్టులేనని అన్నారు. నిత్యావసరాల ధరలను నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. ఉపాధిహామీ చట్టాన్ని తీసుకువచ్చేలా చేసిన ఘనత ఎర్ర జెండాకే దక్కుతుందన్నారు. నూతనకల్ మండలంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, కందాళ శంకర్‌రెడ్డి, లింగయ్య, ఉప్పల్‌రెడ్డి, రాఘవులు, అచ్చయ్య, కృష్ణారెడ్డి, బుర్ర శ్రీనివాస్, నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, కోట గోపి, మట్టిపల్లి సైదులు, సత్యం, జోగునూరి దేవరాజ్, ఉప్పలయ్య, సోమయ్య, పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నామినేషన్



నల్లగొండలో ప్లకార్డులో ప్రదర్శిస్తున్న మేళ్లచెర్వు వాసులు

మేళ్లచెర్వు, ఏప్రిల్ 23 : మేళ్లచెర్వు ప్రజల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించాలనే నల్లగొండ పార్లమెంట్ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్నట్లు రేళ్ల నర్సింహారావు తెలిపారు. నల్లగొండ ఎంపీ స్థానానికి నామినేషన్ వేసేందుకు స్థానికులతో కలిసి నల్లగొండ జిల్లా కేంద్రానికి వెళ్తూ సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు శివాయలంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. మండల కేంద్రంలోని సిమెంట్ కంపెనీలు భూకబ్జాలకు పాల్పడుతున్నాయని, భూదాన్ భూములను ఆక్రమించి, అక్రమ నిర్మాణాలు చేపట్టాయన్నారు. మండల పరిధిలోని 1057, 874, 876, వేపలమాదారం గ్రామంలోని 1,4,175 సర్వే నెంబర్లలోని భూదాన్ భూమిని స్థానిక కంపెనీలు ఆక్రమించాయన్నారు. ఆయా సర్వే నెంబర్లోనే మిగతా వేల ఎకరాల భూములు వివాదాస్పదమై ధరణిలో వివరాలు నమోదు కాకపోవటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ధరణి సమస్యలు పరిష్కరించాలని, రైతుల పొలాల చుట్టు సిమెంట్ కంపెనీలు నిర్వహిస్తున్న అక్రమ మైనింగ్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. పరిశ్రమలు నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను తొలగించాలని, గత ఆగస్టులో మైహోం విస్తీర్ణం కోసం ఏర్పాటుచేసిన ప్రజాభిప్రాయ సేకరణకు ముందు తమ ఫోన్లు ట్యాపింగ్ చేసి, తమను అక్రమంగా అరెస్టు చేశారన్నారు. ఇటువంటి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకరావటం కోసం నామినేషన్ దాఖలు చేస్తున్నట్లు తెలిపారు. నామినేషన్ అనంతరం నల్లగొండ కలెక్టరేట్ ఎదుట స్థానిక సమస్యలపై ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. నిరసన తెలిపిన వారిలో మారిశెట్టి శివ, శ్రీనుయాదవ్, వారం పిచ్చయ్య ఉన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

అనంతగిరి, ఏప్రిల్ 23 : సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలంలో వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపారు. మండలంలోని పాలారంతండాలో ఎక్స్‌కవేటర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న అయ్యన్నగారి స్వామి మూడు రోజులుగా కనిపించడం లేదని అతడి భార్య కవిత మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందన్నారు. ఆమె ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ నెల 22న ఉదయం పనినిమిత్తం ఇంటి నుంచి వెళ్లి పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికి వచ్చాడని, మరలా ఇంట్లో నుంచి వెళ్లి రాలేదని ఆమె ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అబద్ధాలతో కాలం వెళ్లబుచ్చుతున్న సీఎం

- మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి



నల్లగొండలో బీఆర్ఎస్ నాయకుల ర్యాలీ

నల్లగొండ, ఏప్రిల్ 23 : సీఎం రేవంత్‌రెడ్డి బూతులు తిడుతూ, అబద్ధాలు ఆడుతూ కాలం వెళ్లబుచ్చుతున్నాడని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. నల్లగొండ పార్లమెంట్ స్థానానికి బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి నామినేషన్ సందర్భంగా నల్లగొండ జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ సీఎం, డిప్యూటీ సీఎంలు రుణమాఫీకి అంత తొందర ఎందుకని అంటున్నారని, టైం ఉంది కదా అనడం ఎంతవరకు సమంజసమన్నారు. కాంగ్రెస్ పార్టీవి అన్నీ అబద్ధాలని, రైతుబంధు అడిగితే జిల్లాకు చెందిన ఓ మంత్రి చెప్పుతో కొడతా అంటున్నాడన్నారు. నీళ్లు ఇవ్వలేని దద్దమ్మలు ఈ మంత్రులని, ఈ ఎన్నికల్లో ఎగిరేది గులాబీ జెండానే అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభంజనం సృష్టిస్తుందని, కేసీఆర్‌కు మాత్రమే ఓటు అడిగే హక్కు ఉందన్నారు. పదవుల కోసం కాంగ్రెస్ నాయకులు నోరు మూసుకున్నారని, వాళ్లని తన్ని తరిమేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సాగర్ నీటిని దోచుకుపోతుంటే మంత్రులు టైంపాస్ చేస్తున్నారని, కనీసం సోయి లేకుండా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. కనీసం సాగర్ డ్యాం పైకి వెళ్లే ధైర్యం కూడా వారికి లేదన్నారు. సీఎం రేవంత్ జిల్లాకు వచ్చినప్పుడు వీటన్నింటికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గులాబీ జెండానే తెలంగాణకు శ్రీరామరక్ష అని పూటకో మాట మార్చే కాంగ్రెస్ పార్టీని ప్రజలు విశ్వసించరని అన్నారు.

బీఆర్ఎస్ హయాంలో అన్నిరంగాల్లో అభివృద్ధి

పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం అన్నిరంగాల్లో తెలంగాణను అభివృద్ధి చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగున్నర నెలల్లోనే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి అన్నారు. ఎన్నికల్లో భారీ మెజార్టీతో తనను గెలిపించాలన్నారు. అంతకుముందు కృష్ణారెడ్డి నల్లగొండ చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామంలో రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం నల్లగొండలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, కంచర్ల భూపాల్‌రెడ్డి, ఎన్ భాస్కర్‌రావు, బొల్లం మల్లయ్య యాదవ్, నోముల భగత్, తిప్పన విజయసింహారెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, కటికం సత్తయ్యగౌడ్, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.



విద్యుద్దీపాల వెలుగులో మఠంపల్లిలోని చర్చి

తిరునాళ్లకు ముస్తాబైన శుభవార్త దేవాలయం

మఠంపల్లి, ఏప్రిల్ 23 : దక్షిణ తెలంగాణలోనే అతిపెద్ద చర్చిగా పేరుగాంచిన సూర్యాపేట జిల్లా మఠంపల్లి శుభవార్త దేవాలయంలో తిరునాళ్లకు ముస్తాబైంది. ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు వార్షిక మహోత్సవాలు అత్యంతవైభవంగా జరగనున్నాయి. ఈ వేడుకల కోసం దేవాలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. కృష్ణానది సమీపంలో వెలసిన శుభవార్త దేవాలయం, మరియ మాత దీవెనలతో ఈ ప్రాంతం విరాజిల్లుతోంది. మరియమాతను కులమతాలకు ఆరాధిస్తుంటారు. ఆ తల్లి దీవెనలు పొందేందుకు తరలివస్తుంటారు. శుభవార్త దేవాలయం(మంగళవార్త చర్చి) 1968వ సంవత్సరంలో నిర్మించగా ఈ చర్చి పురాతనం కావటంతో 1980లో కొత్తగా నిర్మానానికి శంకుస్థాపన చేసి 1993లో పూర్తి చేశారు. అప్పటివరకు మంగళవార్త చర్చిగా పిలవబడుతున్న దేవాలయాన్ని శుభవార్త దేవాలయంగా నామకరణం చేశారు. ప్రతీ ఏడాది ఏప్రిల్ 24, 25, 26 తేదీల్లో గ్రామస్థుల ఆలయ వార్షికోత్సవాన్ని పెద్దపండుగ పేరుతో నిర్వహిస్తారు. కులమతాలకు అతీతంగా గ్రామస్థులంతా ఈ పండగను ఘనంగా నిర్వహించుకుంటారు. క్రైస్తవ కుటుంబాలు ఇతర ప్రాంతాల్లోని బంధుమిత్రులందరూ ఈ పండుగకు పిలుస్తుంటారు. ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు విచారణ గురువు మార్టిన్ పసల తెలిపారు. ప్రతీ రోజు ఉదయం 6గంటలకు నవదిన జపాలు, దివ్యబలిపూజ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 25న ఉదయం 9గంటలకు శుభవార్త పండుగ సమష్టి దివ్యబలిపూజను నల్లగొండ, గుంటూరు, ఖమ్మం పీఠాధిపతులతో నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఒత్తుల సమర్పణ ,సాయంత్రం 5 గంటలకు ప్రత్యేకంగా అలంకరించిన రథం(తేరు)పై మరియమాత విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించనున్నట్లు తెలిపారు. 26వ తేదీన ఉదయం 7గంటలకు మరణించిన వారి కోసం దివ్యబలిపూజ(పెద్దల పూజ) నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ

26నుంచి తెలుగు రాష్ట్రాల స్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలు

మఠంపల్లి శుభవార్త దేవాలయ తిరునాళ్ళ సందర్భంగా శుభోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి 29 వరకు తెలుగు రాష్ట్రాల స్థాయి ఎద్దుల బండలాగుట బల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గాదె జయభరత్‌రెడ్డి తెలిపారు. పోటీలు నిర్వహించే స్థలాన్ని కమిటీ సభ్యులతో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీలు 8గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు జరుగుతాయన్నారు. పోటీలను మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, ఫాదర్ మార్టిన్ పసల, సిస్టర్ రూబీలతో కలిసి ప్రారంభిస్తారని తెలిపారు. ఆరు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.

అదుపు తప్పి ఇంటిపైకి దూసుకెళ్లిన ప్రైవేట్‌బస్సు



మునగాలలో రోడ్డు పక్కన ఇంటిపైకి దూసుకెళ్లిన ప్రైవేట్ బస్సు

మునగాల, ఏప్రిల్ 23 : సూర్యాపేట జిల్లా మునగాలలో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై అడ్డు వచ్చిన గేదెను తప్పించబోయిన ప్రైవేట్ బస్సు రోడ్డు పక్కన ఇంట్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఇద్దరికి స్వల్పగాయాలు కాగా ఎవరికీ ప్రాణనష్టం జరగకపోవడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి మునగాల ఎస్ఐ బీ అంజిరెడ్డి తెలిపిన ప్రకారం.. సోమవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో హైదరాబాద్ నుంచి యానంకు 34 మంది ప్రయాణికులతో రెయిన్‌బో ప్రైవేటు ఏసీ టూప్లస్ వన్ సీట్ బస్సు బయలుదేరింది. తెల్లవారుజామున మూడుగంటల సమయంలో జాతీయ రహదారిపై మునగాల మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రి ఎదుట గేదె అడ్డుగా రావడంతో డ్రైవర్ తప్పించే ప్రయత్నం చేశాడు. బస్సు అతివేగంతో ఉండటంతో అదుపు తప్పి రోడ్డుకు పక్కన ఉన్న ఉప్పుల యుగంధర్‌రెడ్డి పెంకు, రేకులతో కూడిన ఇంటి మీదికి దూసుకెళ్లింది. అదే సమయంలో అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో వైర్లు తెగిపడ్డాయి. అయితే ఆ ఇంట్లో ఎవరూ ఉండటం లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. బస్సులోని ఇద్దరు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఘటనతో ప్రయాణికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. స్థానికుల సమాచారం మేరకు విద్యుత్ సరఫరా నిలిపివేసి స్థానికులు సహాయక చర్యలు చేపట్టారు. ప్రయాణికులను బస్సు కిటికీల నుంచి కిందికి దింపారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అన్నిరంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం



రోడ్‌షో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీ అభ్యర్థి మల్లేష్, నాయకులు

భువనగిరి టౌన్ / రాజాపేట, ఏప్రిల్ 23 : కాంగ్రెస్ ప్రభుత్వం అన్నిరంగాల్లో విఫలమైందని, సంక్షేమం కుంటుపడిందని బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్ అన్నారు. ఈనెల 25న మాజీ సీఎం కేసీఆర్ యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి జిల్లా కేంద్రంలో పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. అదేవిధంగా రాజాపేట మండలం దూది వెంకటాపురంలో నిర్వహించిన బీరప్ప కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ ఆగడాలను బట్టబయలు చేసేందుకు ఈ నెల 25న కేసీఆర్ నిర్వహిస్తున్న రోడ్‌షోను విజయవంతం చేయాలన్నారు. స్వచ్ఛందంగానే ప్రజలు రోడ్ షోలో పాల్గొంటారన్నారు. ఓటర్ల ఆదరణతో తన గెలుపు ఖాయమన్నారు. బీఆర్ఎస్ గెలుపును ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. భువనగిరిలో ఆయన వెంట జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, కొలుపుల అమరేందర్, పట్టణ, మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఏవీ కిరణ్‌కుమార్, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, జనగాం పాండు, నీల ఓం ప్రకాశ్ పాల్గొన్నారు. అదేవిధంగా దూదివెంకటాపురంలో మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతారెడ్డి, నాయకులు గడ్డమీది రవీందర్, గొల్లపల్లి రామిరెడ్డి, గోపాల్‌రెడ్డి, కనకరాజు, మధుసూదన్‌రెడ్డి, సంతోష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



విద్యుదాఘాతంతో మృతిచెందిన గేదె

మోత్కూరు, ఏప్రిల్ 23: యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండలం పొడిచేడు గ్రామంలో జిట్ట బుచ్చమ్మకు చెందిన నిండు సూడితో ఉన్న పాడి గేదె మంగళవారం విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. ఆదివారం రాత్రి వీచిన ఈదురుగాలులకు విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. మంగళవారం మేత కోసం వదిలిన గేదె తెగిపడిన విద్యుత్ తీగలకు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందింది. సుమారు రూ.90 వేల నష్టం వాటిల్లిందని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన బుచ్చమ్మకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని మాజీ సర్పంచ్ పేలపూడి మధు కోరారు.

మూడు గ్రామాలకు నిలిచిన విద్యుత్ సరఫరా

నకిరేకల్, ఏప్రిల్ 23: నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలంలోని ఓగోడు గ్రామ శివారులో 11 కేవీ విద్యుత్ స్తంభాన్ని ట్రాక్టర్ ఢీ కొనడంతో స్తంభం కూలిపోయింది. దీంతో పక్కనే ఉన్న 132 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు లేవడంతో ఓగోడు, నడిగూడెం, వల్లభాపురం గ్రామాల్లో మూడు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అతి వేగంగా అజాగ్రత్తగా 11కేవీ విద్యుత్ స్తంభాన్ని ట్రాక్టర్ ఢీ కొట్టడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగి 132 కేవీ మూడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఆగిపోయాయి. ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగం కారణంగానే 11కేవీ విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టాడని దీంతో మంటలు చెలరేగి పక్కనే ఉన్న 132 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లు కూడా కాలిపోయాయని ప్రస్తుతం లక్ష రూపాయలు నష్టం జరిగినట్లు గుర్తించామని విద్యుత్ ఏడీ శ్రీకాంత్ తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిచిన కొద్ది సేపటికే అధికారులు చర్యలు చేపట్టామని ఏడీ తెలిపారు.

నల్లాలకు మోటార్లు బిగిస్తే కేసులు



నల్లాకు బిగించిన మోటార్లను స్వాధీనం చేసుకున్న మునిసిపల్ అధికారులు



సూర్యాపేటటౌన్, ఏప్రిల్ 23: సూర్యాపేట జిల్లాకేంద్రంలోని మునిసిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో ఇంటి నల్లాలకు నేరుగా మోటార్లు బిగించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మునిసిపల్ కమిషనర్ బి. శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలో నీటి సరఫరా సిబ్బందితో కలిసి నల్లాకు బిగించిన మోటార్లను తొలగించి మాట్లాడారు. పట్టణ గృహ యజమానులు తమ ఇళ్లలో నల్లాలకు నేరుగా పెట్టవద్దని సూచించారు. మోటార్లు బిగిస్తే రూ.10వేల జరిమానా విధిస్తామని, అదేవిధంగా నల్లా కనెక్షన్‌ను శాశ్వతంగా తొలగిస్తామని హెచ్చరించారు. అనంతరం 16మోటార్లను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఏఈ వరుణ్, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా హనుమాన్ విజయ యాత్ర



భువనగిరిలో విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి టౌన్, ఏప్రిల్ 23: జై శ్రీరామ్, జై హనుమాన్ నినాదాలు, భక్తి పాటలు, కాషాయ జెండాలతో యువత కేరింతల నడుమ వీర హనుమాన్ విజయ యాత్ర మంగళవారం భువనగిరిలో ఉత్సాహంగా కొనసాగింది. విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో స్థానిక పెరుమాండ్ల హనుమాన్ ఆలయంలో పూజలు చేసిన అనంతరం ప్రారంభమైన యాత్ర పట్టణమంతటా కొనసాగింది. ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి హనుమాన్ యాత్రకు స్వాగతం పలికి మాట్లాడుతూ ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదన్నారు. మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకురాలు కుంభం కీర్తిరెడ్డి, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి యాత్రకు స్వాగతం పలికి మాట్లాడారు. హిందూ సంఘాల నాయకుడు చీకోటి ప్రవీణ్ మాట్లాడుతూ హిందుత్వాన్ని కాపాడితేనే దేశం సుభిక్షితంగా ఉంటుందన్నారు. వీహెచ్‌పీ రాష్ట్ర సహాయ కార్యదర్శి తోట భానుప్రసాద్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పోత్నక్ రఘువేందర్, సుక్క శ్రీశైలం, భజరంగ్‌దళ్ జిల్లా కన్వీనర్ పోకల సందీప్, పోల శ్రీనివాస్‌గుప్త, పసుపునూరి మనోహర్, సాల్వేరు వేణు, బీజేపీ పట్టణ, మండల అధ్యక్షులు రత్నపురం బలరాం, సురేష్‌రెడ్డి, మునిసిపల్ వైస్‌చైర్మన్ మాయ దశరథ, ఎంపీపీ నరాల నిర్మల, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్‌కుమార్, మునిసిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్, కౌన్సిలర్ ఈరపాక నర్సింహ, గుర్రాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

చౌటుప్పల్ టౌన్: పట్టణంలోని పాటిమీది ఆంజనేయ స్వామి దేవాలయం నుంచి సీతారామచంద్రస్వామి దేవస్థానం వరకు హనుమాన్ ఉత్సవ విగ్రహంతో భక్తులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో చౌటుప్పల్ మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ పిల్లలమర్రి శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ పెద్దిటి బుచ్చిరెడ్డి, దేవాలయ అధ్యక్షుడు సందగళ్ల నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఊడుగు రమేష్, మునిసిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, గ్రంథాలయ మాజీ చైర్మన్ ఊడుగు మల్లేశ్, కౌన్సిలర్ ఎస్.విజయ, ఎం.రమేష్‌గౌడ్ పాల్గొన్నారు. పెరుమళ్ల ఆంజనేయ దేవాలయం నుంచి సీతారామచంద్ర స్వామి దేవాలయం వరకు మరో హనుమాన్ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. మునిసిపల్ బీజేపీ ఫ్లోర్ లీడర్ పి.శ్రీధర్‌బాబు, ఉప్పు ఆంజనేయులు, భూపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌చారి పాల్గొన్నారు.

మోత్కూరు : విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో మోత్కూరులో హనుమాన్ విజయోత్సవ ర్యాలీని ఘనంగా, వైభవంగా నిర్వహించారు. ర్యాలీలో కాంబోజు మహేందర్, కొణతం నాగార్జునరెడ్డి, దొంతి నర్సింహారెడ్డి, జక్క మోహన్‌రెడ్డి, కోమటి జనార్దన్, బుస్సా శ్రీనివాస్, బద్దం రామనర్సింహారెడ్డి, బద్దం నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

రాజాపేట: మండలంలోని రాజాపేట, బొందుగుల, రాఘునాథపురం, బేగంపేట గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. హనుమాన్ భక్తులు ఊరేగింపులు నిర్వహించి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు.

భూదాన్‌పోచంపల్లి : పట్టణంలోని మండల విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్నం శివకుమార్, పట్టణ బీజేపీ అధ్యక్షుడు డబ్బికార్ సాయేష్‌కుమార్, అసెంబ్లీ కన్వీనర్ చిక్క కృష్ణ, జిల్లా నాయకులు సుర్కంటి రంగారెడ్డి, మార్కండేశ్వరస్వామి దేవాలయం ప్రధాన కార్యదర్శి రుద్ర బాలరాజు, బీజేపీ నాయకులు గంజి బస్వలింగం, తండ రమేష్‌గౌడ్, బల్ల దుర్వాసులు, చిట్టిమల్ల లక్ష్మీనారాయణ, వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ నాయకులు బడుగు శివకుమార్, రాజ్‌కుమార్, డి.వంశీ, అనిల్‌రాజ్ ఉన్నారు.

సంస్థాన్‌నారాయణపురం: మండల కేంద్రంలో మండల కేంద్రంలో యువజన సంఘాల ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి శోభాయాత్ర వైభవంగా జరిగింది. మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ దేవాలయాన్ని సందర్శించి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాలలో ఎంపీపీ గుత్తా ఉమాదేవి ప్రేమ్చందర్ రెడ్డి, శంకరానంద స్వామి, ఉప్పల లింగస్వామి, సుర్వి రాజుగౌడ్, పుష్కాగుల గిరి పాల్గొన్నారు.

తుర్కపల్లి: మండల కేంద్రంలోని పాటిగడ్డ పై ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. తుల్ల కృష్ణయ్య, పోరెడ్డి పాపయ్య, యెలుగల రాజయ్య, పీఎసీఎస్ చైర్మన్ సింగిరెడ్డి నర్సింహరెడ్డి, మాజీ సర్పంచ్‌లు పడాల చంద్రం, పడాల వనీతశ్రీనివాస్, డాక్టర్ అంబటి చెన్నకిష్టయ్య, ఆకుల దేవయ్య, పడాల శ్రీకాంత్ పాల్గొన్నారు. విజయోత్సవ వేడుకల్లో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పడాల శ్రీనివాస్ వేర్వేరుగా పాల్గొన్నారు. ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ప్రభుత్వ విప్ పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ఆయనను శాలువాతో సన్మానించారు. ఆయన వెంట యాదగిరిగుట్ట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుడిపాటి మధుసూధన్‌రెడ్డి, నాయకులు గుండెబోయిన బాలమల్లు యాదవ్, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు ఐనాల చైతయ్య, బోరెడ్డి మహిపాల్‌రెడ్డి, జగదీష్ ఉన్నారు.

రామన్నపేట: రామన్నపేట, సిరిపురం, వెల్లంకి, ఇంద్రపాలనగరం మునిపంపుల, జనంపల్లి, కక్కిరేణి గ్రామాల్లో అంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో టి.సూర్యనారాయణ, లవణం ఉపేందర్, ఏలూరి శ్యామ్, నకిరెకంటి మొగులయ్య, వనం అంజయ్య, గోదాసు సుగ్రీవులు పాల్గొన్నారు.

వలిగొండ: మండలంలోని టేకులసోమారంలో ఆంజనేయ స్వామికి శాస్త్రోక్త పూజలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో పనుమటి దామోదర్‌రెడ్డి, మురళీదర్‌రెడ్డి, మల్లారెడ్డి, వెంకట్‌రామ్‌రెడ్డి పాల్గొన్నారు.

బీబీనగర్: మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో జరిగిన వేడుకలకు ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు పంజాల రామాంజనేయులుగౌడ్, గోళి పింగల్‌రెడ్డి, గోళి నరేందర్‌రెడ్డి, పంజాల పెంటయ్యగౌడ్, శ్రీనివాస్, కాసుల సత్యనారాయణగౌడ్, ముత్యాలు పాల్గొన్నారు.



చౌటుప్పల్‌లో ర్యాలీలో పాల్గొన్న మునిసిపల్ చైర్మన్ రాజు తదితరులు



పోచంపల్లిలో ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు



మోత్కూరులో ర్యాలీలో పాల్గొన్న నాయకులు

రక్షిత నీరు వృథా

● మూడు నెలలుగా రోడ్డుపై పారుతున్న గోదావరి జలాలు



భువనగిరిలో రోడ్డుపై పారుతున్న గోదావరి జలాలు

భువనగిరి టౌన్, ఏప్రిల్ 23: ప్రజల గొంతు తడపాల్సిన గోదావరి జలాలు భువనగిరి మునిసిపాలిటీ పరిధిలో రోడ్డుపై వృథాగా పారుతున్నాయి. పైపులైన్ లీకేజీతో మూడు నెలలుగా స్థానిక జగదేవ్‌పూర్ రోడ్డు నుంచి బంజారాహిల్స్‌కు వెళ్లే రహదారిపై 30వ వార్డు పరిధిలో రక్షిత జలాలు రోడ్డు పాలవుతున్నాయి. పైపులైన్ లీకేజీ, వృథా అవుతున్న తాగునీటిపై స్థానికులు ఇచ్చిన పలు ఫిర్యాదుల మేరకు ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది కూడా పలుమార్లు లీకేజీని పరిశీలించి వెళ్లారు మినహా ఇప్పటివరకు చేసిందేమీ లేదని స్థానికులు పేర్కొంటున్నారు. నీటి వృథాపై స్థానికులు ఇచ్చిన పలు ఫిర్యాదుల మేరకు అధికారులు, సిబ్బంది సందర్శించి వెళ్లారు మినహా చేసిందేమీ లేదని పలువురు పేర్కొంటున్నారు. దీంతో నల్లాల ద్వారా ఇంటికి చేరాల్సిన తాగునీరు రోడ్డుపై పారుతూ మురికి కాలువలో చేరుతోంది. దీంతో ఆ ప్రాంతంలో అపరిశుభ్రత నెలకొనడంతో పాటు లీకేజీ కారణంగా ఆ పైపులైన్ ద్వారా సరఫరా అవుతున్న తాగునీరు కలుషితమవుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పైపులైన్ లీకేజీల పేరిట మునిసిపల్ వార్షిక బడ్జెట్‌లో లక్షలాది రూపాయల కేటాయింపు జరుగుతున్నటికీ నెలల తరబడిగా లీకేజీలకు మరమ్మతులు చేపట్టకపోతుండటంతో పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి లీకేజీలు పట్టణ వ్యాప్తంగా ఉన్నాయని వెంటనే వాటన్నింటికీ మరమ్మతులు చేసి నీటి వృథాను అరికట్టడంతో పాటు ప్రజారోగ్యాన్ని కాపాడాలని ప్రజలు అంటున్నారు. ఇదిలా ఉండగా పట్టణంలోని తాగునీటి పైప్‌లైన్లకు ఏర్పడిన లీకేజీలన్నింటికీ వెంటవెంటనే మరమ్మతులు చేయిస్తున్నామని, మిగిలిన లీకేజీలను త్వరలోనే నియంత్రిస్తామని మునిసిపల్ కమిషనర్ రామాంజుల్‌రెడ్డి తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



సహజ కు డిపాజిట్ పుస్తకం అందేస్తున్న పోస్టుమాస్టర్ అమర్నాథ్

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 23: అనారోగ్యంతో తండ్రి చనిపోయిన ఓచిన్నారికి దాతలు తోచిన ఆర్థిక సాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు. మండల కేంద్రంలో రామ్‌నగర్ కాలనీకి చెందిన ఎల్మినేటి స్వామి అనే రోజు వారి కూలీ అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతిచెందాడు. స్వామికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అదే రోజు అతని కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగాలేని విషయాన్ని వాట్సాప్ గ్రూప్‌లో పోస్టుచేశారు. స్పందించిన దాతలు, స్నేహితులు, బంధుమిత్రులు, రు.71,000 అందజేశారు. ఈ సాయాన్ని స్థానిక పోస్టాఫీసులో సుకన్య సమృద్ధి యోజన పథకం ద్వారా స్వామి కుమార్తె సహజ పేరిట మంగళవారం జమ చేశారు. డబ్బులు జమ చేసిన పాస్ పుస్తకాన్ని పోస్టుమాస్టర్ అమర్నాథ్ సహజకు అందజేశారు. ఆర్థిక సహాయం అందించిన దాతలతో పాటు, డబ్బులు పోస్టాఫీసులో జమ చేసేవరకు ముందుండి సహకరించిన యాస గోవర్ధన్‌రెడ్డికి సహజ తల్లి కల్పన, తాత యాదయ్య కృతజ్ఞతలు తెలిపారు.

గురుకుల విద్యార్థినుల ఇంటిబాట



ఆనందంతో ఇళ్లకు బయలుదేరిన విద్యార్థినులు

చౌటుప్పల్ టౌన్, ఏప్రిల్ 23: ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించడంతో మంగళవారం చౌటుప్పల్ పట్టణంలోని ప్రభుత్వ గురుకుల పాఠశాలలకు చెందిన 522 మంది విద్యార్థులు ఇళ్లకు వెళ్లిపోయారు. బాలికల గురుకుల పాఠశాలలోని 6 నుంచి 9వ తరగతి వరకు గల 360 మంది విద్యార్థినులు, కస్తూర్బా విద్యాలయంలోని 6 నుంచి 9 వ తరగతి వరకు గల 162 మంది విద్యార్థినులు ఇళ్లకు పోయారు. కస్తూర్బా విద్యాలయంలోని 162 మంది విద్యార్థినులకు పరీక్షలు నిర్వహించి ప్రోగ్రెస్ కార్డులను ప్రిన్సిపాల్ భవానీ అందజేశారు. జూన్ 13న పాఠశాలలను రీ ఓపెన్ చేయనున్నారు.

25నుంచి ఓపెన్ స్కూల్ సొసైటీ పరీక్షలు

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 23: ఓపెన్ స్కూల్ సొసైటీ పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు జిల్లాలో నిర్వహించనున్నట్లు డీఈవో కే.నారాయణరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25 నుంచి వచ్చే నెల 2 వరకు ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు తిరిగి మధ్యాహ్నం 2.30గంటల నుంచి 5.30గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షలు మూడు కేంద్రాలు, ఇంటర్మీడియట్ పరీక్షలు మూడు కేంద్రాల్లో నిర్వహించనుండగా 460మంది పదో తరగతి, 732మంది ఇంటర్ పరీక్షలకు హాజరవుతారని, పరీక్ష కేంద్రాలకు 30నిమిషాల ముందుగా హాజరుకావాలని కోరారు.

ప్రీస్కూల్ గ్రాడ్యుయేషన్ డే

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 23 : పట్టణంలోని అంగన్‌వాడీ -1 కేంద్రంలో మంగళవారం ప్రీస్కూల్ గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. కార్యక్రమానికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ హాజరు కాగా, 3-6 సంవత్సరాల పిల్లలకు ఆట, పాట, మాట కథ, సంసిద్ధత, శాస్త్రీయ పరిజ్ఞానం విద్య నేర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎల్‌కేజీ, యూకేజీ, వర్క్‌బుక్స్ డ్రాయింగ్ రాయించారు. పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టీచర్ జంగమ్మ పాల్గొన్నారు.


అకాల వర్షానికి దెబ్బతిన్న వరిపంట



పాడిచేడులో గాలివానకు దెబ్బతిన్న వరి చేను

మోత్కూరు, ఏప్రిల్ 23: ఆదివారం రాత్రి కురిసిన గాలివానకు మండలంలోని పాడిచేడు గ్రామంలో కోతకు వచ్చిన వరిచేలు దెబ్బతిన్నాయని పలువురు రైతులు తెలిపారు. విపరీతమైన గాలివాన కురియడంతో వరిచేలు నేలకు ఒరిగాయని, గాలికి ధాన్యం రాలిందని, చేనును కోయరాకుండా చిక్కుపడిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. వరి కోసే పరిస్థితి కూడా లేదన్నారు. కోస్తే కోత యంత్రం అద్దె కూడా మీద పడే పరిస్థితి ఉందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో రాశులు తడిశాయని, వరద పాటుకు ఉన్న రాశుల నుంచి ధాన్యం కొట్టుకపోయిందని రైతులు చెప్పారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వ మద్దతు ధరకు కొనాలని, గాలివానకు దెబ్బతిన్న వరి చేల వివరాలను వ్యవసాయాధికారుల ద్వారా తెప్పించుకుని ప్రభుత్వం తగిన నష్టపరిహారం ఇవ్వాలని రైతులు, మాజీ సర్పంచ్ మధు కోరారు.

వైభవంగా మహవీర్ జయంతి



జైన దేవాలయంలో నిర్వహించిన రథోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

ఆలేరు రూరల్, ఏప్రిల్ 23: మండలంలోని కొలనుపాకలో గల సుప్రసిద్ధమైన జైన దేవాలయంలో మంగళవారం మహవీర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జైన దేవాలయంలో సంప్రదాయ పూజలు చేశారు. ప్రజలు భక్తి భావాన్ని అలవర్చుకొని ప్రేమను పంచుతూ శాంతియుత మార్గంలో జీవించాలని అన్నారు. దేవలయంలో ప్రాంగణంలోని నిర్వహించిన వేడుకల్లో వివిధ జైన భక్తులు, గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు.

శాంతియుత వాతావరణంలో ఎన్నికలు: ఏసీపీ



ఫ్లాగ్‌మార్చ్‌లో పాల్గొన్న ఏసీపీ మధుసూదన్‌రెడ్డి

వలిగొండ, ఏప్రిల్ 23: శాంతియుత వాతావరణంలో అందరం కలిసి పార్లమెంటు ఎన్నికలను నిర్వహించుకుందామని చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై పోలీసుల ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ బెల్టు షాపులపై కేసులను నమోదు చేశామని పలువురిని ముందస్తు బైండోవర్ చేసినట్లు ఆయన తెలిపారు. భువనగిరి అసెంబ్లీ పరిధిలో ఆరు గ్రామాలు, ఆలేరు పరిధిలో రెండు గ్రామాలను సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించామన్నారు. ఎన్నికలకు ఎవరైనా ఇబ్బందులు కలిగిస్తే చట్టా ప్రకారం చర్యలు తప్పవన్నారు. సురక్షితమైన స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికల నిర్వాహణకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో రామన్నపేట సిఐ వెంకటేశ్వర్లు, వలిగొండ ఎస్ఐ మహేందర్, పోలీస్ సిబ్బందులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

● రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి



సిరిపురంలో ధాన్యం కేంద్రాన్ని పరిశీలిస్తున్న రైతుసంఘం నాయకులు

రామన్నపేట, ఏప్రిల్ 23: మండల వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి, రైతుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని సిరిపురం ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలించి, అనంతరం మాట్లాడారు. వాతావరణంలో మార్పులు వచ్చి వర్షాలు, ఈదురు గాలులకు పండించిన ధాన్యం నేలపాలవుతుందన్నారు. గన్నీ బ్యాగుల కొరత మూలంగా కొనుగోలు వేగవంతం జరగడం లేదన్నారు. సంబంధిత మండల, జిల్లా అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, మిల్లు యజమానులు కుమ్మక్కై రైతులకు మద్దతు ధర అందించడం లేదన్నారు. రబీ సీజన్ వరి కోతలు ప్రారంభమై నెల రోజులు పూర్తికావస్తున్నా ఇప్పటికీ 30శాతం కొనుగోళ్ల జరగలేదన్నారు. వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు బల్గూరి అంజయ్య, ఎంపీటీసీ బడుగు రమేష్, శాఖ కార్యదర్శి అంబటి మల్లారెడ్డి, తదితర రైతులు సుభాష్‌రెడ్డి, కట్ల లక్ష్మారెడ్డి, కె.యాదగిరి, మల్లయ్య పాల్గొన్నారు.

ఆలేరు రూరల్: ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెక్క వెంకటేష్ అన్నారు. మంగళవారం ఆయన ఆలేరులో మాట్లాడుతూ కొనుగోలు చేసిన ధ్యానానికి వెంటనే బిల్లు చెల్లించాలని అన్నారు. సమావేశంలో నాయకులు అంజనేయులు, కిష్టయ్య, యాదగిరి, మల్లయ్య ఉన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



నారాయణపురంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

సంస్థాన్‌నారాయణపురం, ఏప్రిల్ 23: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్ పార్టీకి పట్టం కడతారని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, సూర్యాపేట జడ్పీ వైస్ చైర్మన్ వెంకట్‌నారాయణగౌడ్ అన్నారు. మండలంలోని పుట్టపాక గ్రామంలో మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీ మండల స్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ హామీలతో ప్రజలను మోసం చేస్తుందని వారు విమర్శించారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమైందని వారు ఆరోపించారు. పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను ఓడించి వారికి బుద్ధి చెప్తారని తెలిపారు. నిరంతరం ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న బీఆర్‌ఎస్ పార్టీని ఆదరించి అభ్యర్థి క్యామ మల్లేష్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు.

మోత్కూరు : భువనగిరి పార్లమెంటు నియోజకవర్గంలో ఈ నెల 25న జిల్లా కేంద్రంలో మాజీ సీఎం కేసీఆర్ బస్సు యాత్ర నిర్వహించనున్నారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పొన్నెబోయిన రమేష్, మార్కెట్ మాజీ చైర్మన్లు తీపిరెడ్డి మేఘారెడ్డి, కొణతం యాకూబ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మోత్కూరులో వారు విలేకరులతో మాట్లాడారు.

అడ్డగూడూరు: బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ బస్సు యాత్రను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. అడ్డగూడూరులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీపీ దర్శనాల అంజయ్య, సింగిల్ విండో చైర్మన్ పొన్నాల వెంకటేశ్వర్లు, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ చిప్పలపల్లి మహేందర్‌నాథ్, జిల్లా నాయకులు శ్రీరాముల అయోధ్య, చౌగోని సత్యంగౌడ్ ఉన్నారు.

బీఆర్ఎస్, బీజేపీకి గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధం



సమావేశంలో మాట్లాడుతున్న సంధ్యారెడ్డి

చౌటుప్పల్ టౌన్, ఏప్రిల్ 23: రాష్ట్రంలో బీఆర్‌ఎస్, బీజేపీలకు తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్దంగా ఉన్నారని కాంగ్రెస్ మునుగోడు నియోజకవర్గ కో-ఆర్డినేటర్ బొజ్జ సంధ్యారెడ్డి అన్నారు. చౌటుప్పల్ పట్టణంలోని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో మంగళవారం మునిసిపాలిటీ, రూరల్ మండలాల విస్తృత సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సంధ్యారెడ్డి మాట్లాడుతూ 10సంవత్సరాల కేసీఆర్ పాలనతో రాష్ట్రం సర్వ నాశనమైందని, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన కేసీఆర్‌కు అసెంబ్లీ ఎన్నికలలో ప్రజలు తగిన బుద్ది చెప్పారని ఆమె అన్నారు. కాంగ్రెస్ ప్రభంజనంలో బీఆర్‌ఎస్, బీజేపీలు కొట్టుకుపోవడం ఖాయమని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్‌రెడ్డి 4 లక్షల మెజార్టీతో ఘన విజయం సాధించడం తథ్యమని అన్నారు. మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, వైస్ ఎంపీపీ ఉప్పు భద్రయ్య, పబ్బు రాజు, రమేష్, చెన్నగోని అంజయ్యగౌడ్, ఆకుల ఇంద్రసేనారెడ్డి, బోయ దేవేందర్, సుర్వి నర్సింహ పాల్గొన్నారు.

బూర నామినేషన్‌కు తరలిన బీజేపీ నాయకులు



మోత్కూరు నుంచి తరలుతున్న నాయకులు

మోత్కూరు/ వలిగొండ, ఏప్రిల్ 23: భువనగిరి ఎంపీ స్థానానికి బీజేపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. కార్యక్రమానికి మోత్కూరు నుంచి బీజేపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో బీజేపీ మునిసిపాలిటీ అధ్యక్షుడు పోచం సోమయ్య, నాయకులు గుజ్జ సోమనర్సయ్య, బొట్టు అబ్బయ్య, దొంతి నర్సింహారెడ్డి, గౌరు శ్రీనివాస్, సజ్జనం మనోహర్, చేకూరి మల్లేష్, ఆరె శ్రీను, ముత్తినేని తిరుమలేష్, బీసు మధు, ఎడ్ల రాము, చాడ మంజుల, రమణ, విజయలక్ష్మి ఉన్నారు. వలిగొండ మండలం నుంచి పార్టీ శ్రేణులు భువనగిరికి భారీగా తరలివెళ్లాయి. కార్యక్రమంలో నాయకులు సీఎస్‌రెడ్డి, ఎలె చంద్రశేఖర్, లింగస్వామి ఉన్నారు.

మోదీయే ప్రధాని కావాలి: రచ్చ శ్రీనివాస్

యాదగిరిగుట్ట రూరల్, ఏప్రిల్ 23: దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే మోదీయే ప్రధాని కావాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రచ్చ శ్రీనివాస్, జిల్లా కోశాధికారి కాదూరి అచ్చయ్య తెలిపారు. మంగళవారం మండలంలోని మల్లాపురం గ్రామంలో పలు పార్టీలకు చెందిన నాయకులకు బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో వేముల మాధవరెడ్డి, వేముల దినేష్‌రెడ్డి, గుజ్జ ఉపేందర్‌లతో పాటుగా 50మంది నాయకులు కార్యకర్తలు ఉన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గుంటిపల్లి సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్, నాయకులు కర్రె బీరు మల్లయ్య, ప్రసాద్‌గౌడ్ ఉన్నారు.

కార్మికుల సమస్యలపై ఎర్రజెండాది నిరంతర పోరాటం



వలిగొండ: వర్కట్‌పల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 23: నిరంతరం కార్మికుల సమస్యలపై పోరాటాలు నిర్వహించేది ఎర్రజెండా ఒక్కటేనని, ఆ పార్టీ ప్రతినిధి, భువనగిరి సీపీఎం పార్లమెంట్ అభ్యర్థి ఎండి.జహంగీర్‌ను గెలిపించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ కోరారు. మంగళవారం పట్టణంలోని మునిసిపల్ కార్మికులతో సమస్యలపై ఆయన చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మునిసిపల్ కార్మికులకు వేతనాలను పెంచినప్పటికీ నేటికీ పెరిగిన ఏరియర్స్‌ను కార్మికులకు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యల పైన అధ్యయనం చేస్తూ అనేక పోరాటాలు సాగిస్తున్న జహంగీర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ మంచాల మధు, రైతు సంఘం మండల కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి, సీఐటీయూ నాయకులు ప్రసాదం విష్ణు, వడ్డేపల్లి యాదగిరి పాల్గొన్నారు.

వలిగొండ: ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాడుతున్న ప్రజా నాయకుడు సీపీఎం అభ్యర్థి జహంగీర్‌ను ఎంపీగా గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు నారీ అయిలయ్య ఓటర్లను కోరారు. మండలంలోని వర్కట్‌పల్లిలోని జహంగీర్ గెలుపు కోసం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ మండల కార్యదర్శి స్వామి, నాయకులు రవీందర్‌రెడ్డి, మారయ్య, వెంకటేష్, నరసింహ, మల్లేశం, జ్యోతిబాసు పాల్గొన్నారు.

ఆలేరు రూరల్: ప్రజలకు అండగా నిలిచేది ఎర్ర జెండాయే అని సీపీఎం మండల కార్యదర్శి దూపతి వెంకటేష్ అన్నారు. మంగళవారం పార్టీ అభ్యర్థి ఎండి.జహంగీర్‌ని ఎంపీగా గెలిపించాలని ఆలేరులో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మత రాజకీయాలు చేస్తూ దేశ ప్రజలను మోసం చేస్తోందనారు. రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో రాజు, ఉప్పలయ్య, హనుమంతు ఉన్నారు.